

# ప్రేమ ప్రవాహం

అరిగె రామారావు

'నీవు విజయను ప్రేమిస్తున్నావు–'

'లేదు– పేమించటంలేదు '

'కాని. ని ప్నమే ప్రేమిస్తోంది–'

'ఏమో–అయినా నా కదంతా అనవసరము '

'మరి నీ కవసరమయిందేమిటి ?' అని నే నడిగిన దానికి అనంత్ నావంక చురుగ్గా చూచి పెదవి విరచి నవ్వాడు. వ్రేళ్ళ మధ్యన కాలుతున్న సిగరెట్టును

ఆఖరిదమ్మ్మ లాగి క్రింద పడేసి బూటు కాలుతో నలిపేశాడు.


'నా కవసరమయిం దేమిటూ? ఆమె బాగు. ఆమె ఫ్యూచర్ నా క్కావాలి; అంతేగాని ఈ ప్రేమలు గీమలు నా దగ్గర పనిచేయవ్ చూడు రాము, విజయ ఇప్పు డే పరిస్థితుల్లో వుందో నీకు తెల్సు-'

అవును నాకు తెలుసు విజయ అనంతుకు చిన్ననాటి స్నేహితురాలు ఒకప్పుడు విజయకు అందరూ వుండే వాళ్ళు. కాని ఇప్పు డెవళ్ళూ లేరు. వుద్యోగం లేని అన్న కుటుంబాన్ని పోషించలేక పరారి అయిపోయాడు పెళ్ళి కెదిగిన అక్క పెళ్ళికాక, అవు తుందన్న ఆశలేక ఎవడితోనో లేచి పోయింది ఈ దిగుళ్ళతో తల్లి కన్ను మూసింది మిగిలిన తండ్రిని క్షయ పట్టు కుంది తండ్రి క్షయ నయం చేయించా లని ఈ వూళ్ళో వున్న క్షయ ఆసు పత్రికి వచ్చింది. తండ్రితో లోపలి కెళ్ళింది—ఒక్కర్తే బయటికి వచ్చింది. అనుకోకుండా ఆ పరిస్థితుల్లో అనంతు కలిశాడు, ఆమె గాధంతా విన్నాడు; జాలిపడ్డాడు. ఆమెను ఇక్కడే వుంచి ఆమె కన్నివిధాల సహాయపడుతున్నాడు.

'ఆమె కొక దారి చూపించాలి ఆమె కాళ్ళమీద ఆమె నిలబడే శక్తిని ఆమె కియ్యాలి ఆమెకు టైపు నేర్పిస్తూ ఆమె చేత మెట్రిక్ కట్టించి ప్యాసు చేయించాలి. మెట్రిక్, టైపు ప్యాసవుతే ఆమె కే ఆఫీసులోనో ఓ చిన్న వుద్యో గము దొరక్కపోదు. ఆ వుద్యోగం చేసుకుంటూ తనపొట్ట తాను పోషించు కుంటుంది తన బ్రతుకు తాను బ్రతుకు తుంది...' ఇదీ అనంతు వుద్దేశం, ఆ వుద్దేశంతోనే ఆమెకోసం ఒక చిన్న యిల్లు అద్దెకు తీసికున్నాడు. ఆమెకు కావల్సిన డబ్బూ దస్కం అందిస్తు న్నాడు. ప్రతిరోజూ సాయంత్రం ఆఫీసు అవగానే నేరుగా ఆమె యింటి కెళ్ళి రాత్రి ఎనిమిది తొమ్మిది గంటలవరకు ఆమెకు మెట్రిక్ పాఠాలు చెప్తు తున్నాడు. ఉదయంపూట టైపుకు పంపిస్తున్నాడు. ఎలాగయినాసరే కష్ట పడి ఆమెను పైకి తీసికురావాలని ప్రయ త్నిస్తున్నాడు

'ఆమెకు జీవితంమీద ఇంటరెష్టు క్రియేట్ చేయాలి. మోడువారిన ఆమె జీవితాన్ని మరల చిగురింప జేయాలి. ఆమెకు ఆశలు కలిగించాలి...ఆమె జీవితంలో ఎన్నో బాధలుపడింది ఎన్నో దెబ్బలు తిన్నది జీవితంమీద విరక్తి భావంతో కృంగిపోతున్న ఆమెను మళ్ళీ మామూలు మనిషిని చేసి, ఆమెకు ఒక ఆధారాన్ని కల్పించిననాడే నాకు తృప్తి-అదే చిన్ననాటి స్నేహితుడుగా ఆమెకు నేను చేయగల సహాయం— అంటాడు అనంతు.

అతను చేస్తోన్నపని హర్షింపదగ్గదే!





అతనులాటివాడు నా స్నేహితు డయినందుకు గర్విస్తున్నానుకూడా. కాని, అత నొక విషయంలో మాత్రం చాల వుదాసీనంగా ప్రవర్తిస్తున్నాడు. నా కది నచ్చటంలేదు... నిజంగానే విజయ అతన్ని ప్రేమిస్తున్నది కాని అతడు పట్టించుకోవటంలేదు. అది అతను అనవసరం అంటాడు. అలా అంటేనే నాకుకోపం. అందుకనే అతన్తో అన్నాను: 'మిష్టర్ అసంత్; నీవు చేస్తోంది మంచి పనే! కాదనను, కాని నీవు ఒకటి మర్చిపోతున్నావు. నీవు ఆమెకు జీవితం మీద ఇంటరష్టు క్రియేట్ చేస్తానంటు న్నావు. మెట్రిక్‌కు పాఠాలు చదివింప జేసినంతమాత్రాన జీవితంమీద ఇంట రష్టు క్రియేట్ చేయలేం మిష్టర్. విజయ వయస్సులో వున్న ఆడది. ఆమెను ఈ ఇరవై సంవత్సరాల జీవితంలోని ఆమె అనుభవాలన్నీ బాధలే! దరిద్రం, ఆకలి, రోగాలు, చావులు, ఈసడింపులు ... ఇంతవరకు ఆమె చవిచూచింది దీన్నే! హృదయాన్ని తేలిక పరిచే ప్రేమ ఆమెకు తెలియదు. మనస్సును మత్తుతో ముంచేసుఖం ఆమె ఎరుగదు ... తనను ప్రేమించే హృదయం ఒకటి వున్నదని తెలిసిననాడు, తన ప్రేమనూ, తననూ స్వీకరించే హస్తాలు తన ముందునే వున్నవని తెల్సిననాడు ఆమెలో ఆటో మేటిక్‌గా జీవితంమీద ఇంటరష్టు క్రియేట్ అయిపోతుంది. అప్పు డామెకు ఈ మెట్రిక్‌లు, భాషలు ప్యాసుకావటం చిటికెలమీదపని వెనుకటి ఆమె జీవితానికి, అప్పటి ఆమె వయస్సుకు ఆమెకు కావల్సింది తన ప్రేమను, వయస్సును

స్వీకరించేటక ప్రేమహృదయంమాత్రమే అంతేగాని ఈ మెట్రిక్ పారాల పూదర కాదు —' అని అంటే అతను వినిపించు కోడు; తేలిగ్గా తీసికుంటాడు నావయిపు లోతుగాచూస్తాడు. అతన్లో ఏదోమధనం జరుగుతోంది. ఆ మధనం ఏమిటో నాకు తెల్సు అతను జీవితానికి, నిండుగా ప్రేమించిన లీలావతి అతని ప్రేమను నిరాకరించింది అది జరిగి ఆరు నెలలు అవుతుంది. ఇప్పుడు ఆ లీలావతి మా వాడ్నీ వాడి ప్రేమనూ మరిచిపోయి ఎక్కడో భర్తతో హాయిగా కాపురం చేసుకుంటోంది. కాని వీడుమాత్రం మర్చి పోలేక పోతున్నాడు. కాని భగ్న హృదయం ఇంకా తేరుకోలేదు. మళ్ళీ తన ప్రేమను విజయ ముందు పెట్టితే ఆమెకూడ నిరాకరిస్తే అప్పుడు తన పరిస్థితి ఏమిటి అని బాధపడ్తూ వుండ వచ్చు, అందుకే ముందడుగు వేయలేక పోతుండవచ్చు. అనంతు మధనానికి ఇదే కారణమయితే ఫర్వాలేదు; విజయ తప్ప కుండా వాడి ప్రేమను స్వీకరిస్తుంది. ఆమె వాడ్ని ప్రేమిస్తోంది. ఈ విషయం రూఢిగా నాకు తెల్సు. కాని నా కొక భయం. కొంపదీసి వీడు లీలావతి మీది పగను, కసిని విజయమీద – ఆడవాళ్ళ అందరి మీద – తీసికోవాలని ప్రయత్నిం చటం లేదుగదా! లీలావతిని తను ప్రేమించాడు; కాని ఆమె నిరాకరించింది— తన గుండెలు బ్రద్దలయ్యాయి. ఇంకో ఆడది తనను ప్రేమిస్తోంది. ఆమెను, ఆమె ప్రేమను 'ఛీ, పో' అంటాడు. అప్పుడామె గుండెలు బ్రద్దలవుతాయి. అది చూస్తే తన కానందం. ఆమె ఏడిస్తే లీలావతి ఏడ్చినట్లుగా వుంటుంది... వాడు ఈ విధమయిన మ్యానియాను డెవలప్ చేసుకుంటే వాడి జీవితం నాశన మవుతుంది; ఇంకెంతమందో యువతుల జీవితాలు నాశనమవుతాయి. విజయ ప్రేమవిషయంలోని అనంతు వుదాసీన తకు ఇదే కారణం అనిపిస్తోంది నాకు. అప్పుడప్పుడు వాడి చురుకుకన్నుల్లో వెలగే ఎర్రటి మంటలు ఆడవాళ్ళమీది వాడి పగను చెప్తున్నట్లనిపిస్తున్నాయి. అందుకే నాకు భయం వేస్తోంది. వాడిలో అంకురిస్తోన్న ఈ భయంకర ప్రవృత్తిని ఎలాగయినాసరే నాశనం చేయాలి. వాడి గుండెల్లో పెరుగుతున్న ఈ విషనాగును కాలితో నేల రాయాలి ... అంటే వాడు విజయను ప్రేమించేటట్లు చేయాలి ... విజయముందు తన ప్రేమను వాడు బయటపెట్టాలి. విజయ వాడిది కావాలి...

వాడి కెన్ని విధాలుగా చెప్పినా విని చావటంలేదు ఎలా?

'నీకు పరూధిని ప్రవరాఖ్యుల కథ తెల్సునట్రా అనంత్! ఆ కథలో నీతి ఏమిటి? అది కాదోయ్. అది ముసలి వాళ్ళు చెప్పే నీతి. నీవూ, నేనూ తెల్సు కోవసిన నీతి ఏమిటో తెలుసా? వలచి వచ్చిన ఆడదాన్ని నిరాకరించరాదు.




ప్రవరాఖ్యు డంత క్రూరంగా వరూధినిని నిరాకరించాడు. పాపం ఆమె వానిమీది ప్రేమతో యక్షుడి చేతుల్లో మోస పోయింది. తన వయస్సును వలపును శీలాన్ని ఆ మోసగాడి కర్పించింది. అసలు నన్నడిగితే వరూధినిని మోసం చేసిన పాపం యక్షుడిగాడిది కాదు; ఆమె ప్రేమను నిరాకరించిన ఆ ప్రవ రాఖ్యుడిగాడిది. ఆ వుసురంతా వాడికే! ఆ పాపమంతా వాడిదే!—

'కాబట్టి, ఓ అపర ప్రవరాఖ్యా! విజ యను నీవు కాదన్నావు అంటే ఏ యక్షుడో వస్తాడు. ఆమెను కాస్తా మోసం చేస్తాడు. నిన్ను ప్రేమించటం వల్ల, సతతం నిన్ను ధ్యానించటంవల్ల ఆమెలో చెలరేగిన కాంక్షల కారు చిచ్చులో ఏ బలహీన క్షణంలోనో ఏ యక్షుడి మాయోపాయంలోనో ఆమె పడి నాశనమయిపోతే ఆ పాపమంతా నీదే! పతనానికి కారకుడవు నీవే అవుతావు— జాగ్రత్త—' అని నే నన్నదానికి అనంతు నవ్వుతూ ఇలా అన్నాడు.

'ఇప్పు డామెకోసం యక్షు డెవడూ కాచుకొని కూర్చోలేదులేవోయ్.'

'ఎవడో దాకా ఎందుకు? అవసర మయితే ఆ యక్షుడ్ని నేనే అవుతాను.'

'నీవా? నీవా? నీవు వేయి జన్మలు ఎత్తినా ఆ యక్షుడివి కాలేవు; నీ కలాటి పాపచింతనే రాదు. నాకు తెల్సు—నా మిత్రుడు రాము ఎలాటివాడో! నీ కలాటి పాపం చేసేటంతటి ధైర్యం లేదు; అంత విషమూ లేదు.'

'పొరపడ్డావు అనంత్, పొరపడ్డావు. అవసరమొస్తే ఆ యక్షుడిగాడి తాతలాగా

మోసం చేయగలను. నీకు తెలియదేమో! నాకు చిన్నప్పట్నుంచీ పాపాలు చేయట మంటే మహాసరదా. కావాలని ఎన్నో చీమల్ని కాలితో నేల రాశాను. ఎవరూ చూడకుండా క్రొత్త బ్లేడుతో మా గేదె పొట్టమీద ఇంతబారున చీల్చాను... చూస్తూ చూస్తుండగా మనిషిని కూనీ చేసేటంత పాపం, విషం నాలో వున్నాయి. నే నొక ప్రమాదమయిన వ్యక్తిని, తెల్సా?' ఈ మాట లంటుం డగా నా గుండెలు వణికాయి.

'నీ వయితే అయ్యావే గాని, విజయ ఎవరి చేతిలోనూ మోసగింపబడలేదు. ఆమె తెలివి కలది; ఎదిరించగలదు.'

'బలహీనక్షణా లన్నాను చూడు; ఆ క్షణాలల్లో ఎవరయినా మోసగింప బడుతారు.'

'విజయ అంత బలహీనురాలుకాదు.'

'విజయ బలహీనురాలో కాదో, నేను యక్షుడ్ని అవుతానో కాదో నిరూపించ మంటావా?'

'నీవు నిరూపించలేవు_' అనంతు గట్టిగా అన్నాడు. అత డలా అనేసరికి నాకు కోపం వచ్చింది. నాలో పంతం పెరిగింది.

'ఆల్ రైట్! ఈమాటమీదే వుంటా వుగా!'

'ఓయస్ _ నీ చేత కాదు_' నన్ను రెట్టిస్తూ అన్నాడు.

'అయితే నే నీ క్షణంనుండి యక్షుడ్ని అవుతున్నాను. విజయను ప్రేమిస్తు న్నాను _ కాదు కవ్విస్తున్నాను. మనం ఇకనుండి బద్ధవిరోధులం_' నాలో పెరుగు తున్న పంతం ఆ మాట లనిపింపజేసింది.

'విరోధం దేనికి? నీపని నీవు చెయ్, వుయ్ విల్ సీ_'

'యస్, వుయ్ విల్ సీ!'

* * *

విజయ కాటుకకండ్లను అంత దగ్గ రగా చూస్తున్నప్పుడు, ఆమెకు చేరు వగా కూర్చున్నప్పుడు, నులివెచ్చని గాలులు నాలో లేచినప్పుడు, పైమాట లన్నీ గుర్తుకు వస్తాయి గుర్తుకు వచ్చి నప్పుడు నా పంతం మాట గుర్తుకు వస్తుంది. కేవలం పంతంకోసం నే నీ వ్యవహారంలోకి దిగాను. కాని, విజయను చూస్తున్నప్పుడు, విజయ అందం నా మీద పనిచేస్తున్నప్పుడు నేను అనంతుతో కట్టిన పంతంమాటే మర్చిపోతున్నాను. నే నానాడు అనంతుతో, 'యస్, వుయ్ విల్ సీ,' అని అన్నప్పుడు నా వుద్దేశం ఏమిటంటే_నేను విజయను ప్రేమిస్తు న్నట్లుగా నటించి, అనంతులో కాక తెప్పించాలనీ, విజయ తన చేయి దాటి పోతుందని అనంతు ఆవేశపడి ఆమెను తనదానిగా జేసుకోటానికి ముందుకు వస్తాడనీ, ఆ విధంగా వాళ్ళిద్దర్నీ కల పాలని కాని, తీరా నేను విజయతో చనువుగా మూవ్ అవటం మొదలుపెట్టే సరికి, వ్యవహారం ఒక స్టేజికి వచ్చే

సరికి నేను నటించటం మానివేశాను. ఆ పయిన నటించటం నాకు చాత కాలేదు. నిజంగానే విజయను నాకు తెలియకుండానే ప్రేమించటం మొదలు పెట్టాను నే నిలా మారిపోవటానికి ఒక కారణం — విజయ అందం, అందం లోని ఆకర్షణ, ఆమె సాన్నిధ్యంలోని మత్తు: రెండో కారణం, ముఖ్యమైన బలమైన కారణం — విజయకూడ నా వయిపుకు బెండ్ అవటం; నే నామె దగ్గర కొంత చనువు తీసికుంటే, ఆమె అంతకు రెట్టింపుగా చనువు తీసుకోవ టము; నా ప్రతి యాక్షన్‌కి ఆమె రియాక్టు అవుతూ నాకు వుషారివ్వటం ఇలా ఆమెకూడ నా వయిపు ఆకర్షితురాలవు తుంది అని నాకు తట్టగానే నాలో 'సెల్ఫ్' పనిచేయటం మొదలుపెట్టింది. నా లోని 'మొగవాడు' కాలరు సర్దుకుని సకిలించ టము మొదలుపెట్టాడు విజయను చేయి దాటి పోనీయకూడదు; నా దానిగా జేసుకోవాలనే ఆకాంక్ష నాలో చెలరేగటం మొదలుపెట్టింది ఆమె అందమంతా నాది కావాలి; నా చేతుల్లో నలగాలి ఆమె వలపు, వయ స్సులు నాకు నైవేద్యం కావాలి ఆమె యౌవనపు నెత్తురును అత్తరులాగా నా వంటి కలముకోవాలి. ఆ కళ్ళు నావి ఆ లేతపెదాలు నావి ఆ పల్చటి చెక్కిళ్ళు నావి ఆ మెడక్రింది గీతలు నావి ఆ సన్నటి నడుం నాది ఆమె నాది—నాది కావాలి...అందుకోసం అప్పుడప్పుడు 'అనంత్‌కు ద్రోహం చేస్తున్నానేమో!' ననిపించేభావాన్ని ఈమధ్య పైకి తలఎత్త కుండా అదిమేస్తున్నాను నా కాంషన్స్ 'ఇదితప్పు!' అని సన్నగా గొణిగితే దాని గొంతు నులిమిపారేస్తున్నాను విజయ యౌవనామృతపాత్ర నోటి కందిస్తుంటే త్రాగకుండా ద్రోహం, పాపం, కాంషన్స్ అని త్రోసి పుచ్చ గాదనిపిస్తుంది...నా ఈ వూహలకు, ఆలోచనలకు, అనుకూలంగానే విజయ ప్రవర్తిస్తోంది. మరింత ఇతర ఆలోచ నలు దేనికి? అందుకే అసలు అనంత్‌ను గురించి ఆలోచించటం మానివేశాను అతనితో చాలవరకు కట్ చేసున్నాను

ఈ మధ్య అనంతులో నే నాశించిన మార్పు వస్తోందనిపిస్తున్నది. విజయ నాది అవుతున్నందుకు, తనచేయి దాటి పోతున్నందుకు అతను వుక్రోష పడు తున్నటుగా నా కనుమానం తట్టింది ఎందుకంటే, ఒకరోజు సాయింత్రం నేను విజయ ఇంటిమెట్లు ఎక్కుతుంటే లోపలినుంచి కోపంగా అరుస్తున్న అనంత గొంతు వినిపించింది

'లెక్కలు ఎందుకు చేయలేదంటే రాముతో సినిమా కెళ్ళా. ఇంగ్లీషుపాఠం ఎందుకు రాలే దంటే రాముతో కబు ర్లాడుతూ కూర్చున్నా. నిన్న సాయంత్రం యింటిదగ్గర లేవంటే రాముతో బీచీ కెళ్ళాను... ఇవీ నీసమాధానాలు నీ కా

రాముగాడు తప్పితే ఇంకేమిలేదా ? నీ చదువూ, నీబాగూ నీకక్కర్లేదా ? ఇంక రెండునెలలుకూడా పరీక్షలులేవు. నీవు అలా చదువుతే పరీక్ష ప్యాసయినట్లే, బాగుపడ్డట్లే — ఏమిటా వెకిలినవ్వు ఒక వయిపు నేను చెప్పుతుంటే. నీకే—'


విసురుగా బయటికొచ్చాడు. నేను ఎదురుపడ్డాను. కోపంగా చూశాడు పళ్ళు పటపట కొరికి ధుమ ధుమ లాడ్తూ బయటికి పోయాడు.

ఆరోజునుండి నాలో ఆదుర్దా, ఆవేశం ఎక్కువయ్యాయి. అనంతు ఎక్కడ పుంజుకుంటాడో, ఎక్కడ నాదారి కడ్డువస్తాడో, ఎక్కడ విజయ జారిపోతుందో నని భయంగా వుంది. అందుకని విజయతో నాచనువు ఇంకో స్థాయి పెంచాను. కావాలని విజయను వెంటేసుకుని అనంతు చూస్తూండగా విచ్చలవిడిగా తిరగటం మొదలుపెట్టాను. మమ్మల్ని చూడగానే అనంతు మొగం గంటు పెట్టుకుంటున్నాడు రెండుమూడు రోజుల్నుంచీ నాతో ఏదోవిషయం చెప్ప టానికి ప్రయత్నిస్తున్నాడు. వాడికా అవకాశం ఇవ్వకుండా, వాడు కనిపిస్తే మొగం చాటుచేసుకుని పోతున్నాను.

ఆరోజు సాయంత్రం విజయ యింటికి నడుచుకుంటూ వెళ్తుండగా నాకొక ఆలోచన తట్టింది. ఇక ఈ ముసుగులో గ్రుద్దులాటకు స్వస్తి చెప్పా లనిపించింది రేపు సాయంత్రం అనంతును విజయయింటికి కాఫీకని పిల్చి, విజయ నేను పెళ్ళి చేసుకోబోతున్నట్లుగా ప్రకటిస్తే, అనంతుగాడి ఏడ్పు తీరు తుంది. మా పంతంమాట గుర్తుతెచ్చి నేనే గెల్చినాను బ్రదర్ అని అంటే అప్పటి వాడి ఏడ్పుమొగం చూడాలి.

నేను లోపలి కెళ్ళేసరికి విజయ సావిట్లో మల్లెపూలు గ్రుచ్చుకుంటూ కూర్చుంది. తలంటుకున్న విజయ జుట్టును చూచి ఆవాళ శుక్రవారమని గుర్తుకు తెచ్చుకున్నాను. విజయ నన్ను కుర్చీలో కూర్చోమని చెప్తున్నా క్రింద ఆమె ప్రక్కనే కూర్చున్నాను. ఆమె కొక్కొక్క మల్లెపూవే అందిస్తూ, పూలు గ్రుచ్చుతున్న విజయ అందాన్ని కళ్ళతో త్రాగుతున్నాను. నేను అలా చూస్తుంటే విజయ సిగ్గుపడింది కళ్ళు వంచుకుని ఆమె అలా సిగ్గుపడటం నాకు బలే సరదా.

ప్రొద్దు జారిపోతున్నకొద్దీ సావిట్లో వెలుగులు మాసిపోతున్నాయి. దొడ్లో వెలుగు మాసిపోతున్నకొద్దీ సావిట్లో చిరుచీకట్లు తారట్లాడుతున్నాయి. సావిట్లో చిరుచీకట్లు తారట్లాడుతున్న కొద్దీ విజయ అందం, వత్తి ఎక్కువచేసిన దీపంలాగా వెలుగుతోంది. పూలు గ్రుచ్చుతున్న విజయ, 'ఇస్, అబ్బా!' అంది. సూది వ్రేలుకు గ్రుచ్చుకుంది. రక్తం వస్తోంది. నేను విజయ వ్రేలును గబుక్కున నోట్లో పెట్టుకున్నా. విజయ




నెత్తురు వుప్పగా నోటికి తగిలింది. రక్తాన్ని ఆపటానికి గట్టిగా పీల్చాను. అలా పీలుస్తున్నప్పుడు నా కొక వింత ఆలోచన వచ్చింది. విజయ వంట్లో రక్తాన్ని ఆఖరి బొట్టువరకు అలా పీల్చి త్రాగితే! ఛీ, రాక్షసులు రక్తాన్ని త్రాగుతారని గుర్తుకు వచ్చింది.

విజయ లేచింది నేను లేచి నిలబడ్డాను ఆమె లైటు వేయబోయింది వున్న దీపం చాలు అని వారించాను. నవ్వి వూరుకుంది నవ్వినప్పుడు మరో చిన్న దీపం వెలిగింది.

మల్లెపూలదండను జడలో పెట్టుకోబోతుంటే నేను పెట్టుతాను అని తీసుకున్నాను. నావంక వింతగా చూచింది. ఆమె సమాధానం చెప్పబోయేలోపల వెనక్కి త్రిప్పి మల్లెదండను మడచి జడపాయల్లో పెట్టాను. విజయ భుజాలను పట్టుకుని జడలోని పూలసువాసన చూస్తుంటే ఆమె వణికింది జరిగింది. నేనూ జరిగి నడుంపట్టుకుని దగ్గరకు లాక్కున్నాను. ముద్దుపెట్టుకోబోతుంటే విడిపించుకుంది కిటికీ దగ్గర కెళ్ళి నిల్చుంది. శుక్లపక్షపు చంద్రుడు మింటిపయి కొచ్చాడు.

విజయ అలా పెడసరం చేసిం దేమిటి? పెళ్ళికాకుండానే సరసం చేస్తే పెడసరం కాక ఏమిటి? నే నొక బ్రూటొను. కిటికీ

దగ్గర పిలబడ్డ విజయ సన్నగా ఏడు స్తోంది. నేను కంగారుపడ్డాను

'ఎందుకు విజయ ఏడుస్తున్నావ్?' దగ్గరగా వెళ్ళి అడిగాను.

విజయ ఎక్కిళ్ళు పడుతోంది.

'సారీ, విజయ! తొందరపడ్డాను. పెళ్ళి కాకుండానే ఇలా చేయకూడదు కదూ! మరింకెనాళ్ళో — అందుకని రేపు సాయంత్రం ఇద్దరు ముగ్గురు మిత్రులను టీకి పిల్చి మనపెళ్ళి విషయం ప్రకటిద్దాం— అన్నాను.

'పెళ్ళా? ఎవరికి, మనిద్దరకా?' ఆశ్చర్యంగా అడిగింది.

ఇందులో ఆమె అంతగా ఆశ్చర్యపడవల్సిం దేమిటో నా కర్థం కాలేదు. ఆ విషయమే అడిగాను.

'నేను నిన్ను పెళ్ళాడుతానని ఎందుకనుకున్నావు?' అంది.

'మరి — ఇదంతా ఏమిటి! పెళ్ళాడక పోతే మరి ఇది—'

'వూ— ఇది— ఏమిటి ఇది?'

'మనం కల్సి తిరగటం—చనువుగా వుండటం—'

'కల్సి తిరిగినంత మాత్రాన, చనువుగా వున్నంత మాత్రాన పెళ్ళాడమంటావా? అనంతుకు ద్రోహం చేయమంటావా? నన్ను నేను మోసం చేసుకోమంటావా?'

'ఇందులో ద్రోహం, మోసం ఏమున్నాయి. విజయ?'

'అవును ద్రోహం, మోసమే. నేను అనంతును ప్రేమించాను. ఎప్పుడో నా మనస్సు అతని కర్పించాను. నేను అతని దాన్ని పెళ్ళాడటం అంటూ జరిగితే అతన్నే పెళ్ళాడతాను; లేకపోతే చస్తాను.'

'మరి నన్నెందుకు ప్రేమించావు?'

'ప్రేమించటం కాదు, ప్రేమిస్తున్నట్లు నటించాను. అలా చేస్తేనన్నా అనంతు మారుతాడేమోనని ముందుకు వచ్చి ప్రేమను బయటపెట్టుతాడేమో నని అతన్ని కవ్వించటానికి నీతో చనువుగా వున్నాను.'

ఇం కేమి మాటాడను?

'సారీ, విజయ!' అని బయట కొచ్చా.

మెట్లమీద చీకట్లో అనంతు నిల్చొని వున్నాడు. అతడ్ని చూచి నేను తల వంచుకున్నాను అనంతు లోపలి కెళ్లాడు. మెట్లు దిగబోయి ఆగిపోయాను.

విజయ బోరుబోరున ఏడుస్తోంది. వెనక్కి తిర్గి చూశాను. తన భుజం మీద వున్న విజయ తలను నిమురుతూ ఆమెను సముదాయిస్తున్నాడు అనంత్.

'ఏడవ్వాకు విజి! నేనుత్త బ్రూట్ని విజి. నా బంగారుకొండవు గదూ, ఏడవ్వాకు. నేను నిన్ను తెల్సుకోలేక



పోయాను. ఆలస్యం చేశాను. అయినా ఇప్పటికి మించుకుపోయిం దేమీలేదు ఈ బంగారుకొండను నెత్తిన పెట్టుకు మోస్తాను చూడు విజీ—ఏది నవ్వు—'

రోడ్డుమీది కొచ్చాను. రోడ్డు దీపం చుట్టూ పురుగులు సున్నాలు చుట్టు తున్నాయి దీపం నిశ్చలంగానే వుంది. పురుగులే తిరుగుతున్నాయి.